# అడ్డదారులు

తెల్లని మారుతి వ్యాన్ హైద్రాబాదు వదిలి సాగర్ రోడ్డుపై మల్లెపల్లి వైపు పరుగెడుతువుంది. నగర పొలిమర దాటగానే పంట చేలు, ప్లాట్లు చేసి నాటిన రాళ్ళ గుర్తులు. తాడిచెట్లు వాటికి వేలాడుతున్న లొట్లు. వాటిని చూస్తు నడుపుతుంది వ్యాను లోపల రజని ఒక్కసారె "ఓప్" అని అరిచింది స్వాతి సడన్‌గ బ్రేక్ వేసి "ఏందె అట్లా అరిసితివి" అని రజని వైపు చూసింది కళ్ళు పెద్దవి చేస్తూ.

"అటు చూడు " అని అడ్డంగా పరుగెత్తుతున్న కుందేలును చూపించింది రెండు చేతి వేళ్ళను బుగ్గల మీద వుంచుకుంటూ.

"ఓస్ అదా" అవి అట్లానే పరుగెడుతూనే వుంటాయిలే" అంది నవ్వుతు.

"దానిమీదినుంచి పోనీస్తవేమోనని భయమేసిందబ్బా" అంది రజని అదో మాదిరిగ చూస్తు నుదుటిపై పడుతున్న వెంట్రుకలను సర్దుకుంటు.

"నాకు లైసెన్స్ వున్నదన్న విషయం నీకు తెల్సు అనుకుంట" అంది ధీమాను ప్రదర్శిస్తు.

"అందుకే భయం, లైసెన్స్ వున్నవాళ్లె యాక్సిడెంట్ చేసేది!

"అచ్చా" అంది ఓరగా చూస్తు.

"మీకు క్షేమంగా ఇల్లు చేరాలని వుందా లేదా" అంది మళ్ళీ తానే రజని వైపు చూస్తు.

"అవును గాని కళ్లు ముందుంచు ఎందుకైనా మంచిది. వంటి మీది వోనిని సరిచేసుకుంటు ముందుంచుతల్లి" అంది శాలిని

"రేపు మీ వారు బండినడుపుతుంటె పక్కన కూర్చొని ఇలాగే చెపుతరే" అని అడిగింది స్వాతి సీరియస్ ముఖం పెడుతూ.

"అదే ఎందుకు చెప్పం" అంది సలోమి.

"లేకపోతే పక్కకు జరగమంటం" అంది సలోమి మళ్లి కనుగుడ్లు పెద్దవి చేసి చూస్తు.

"చూస్తాగా" అంది వాళ్ల వైపు చూస్తు.

"ఇప్పుడైతె రోడ్డును చూడు తల్లి అంది" రజని

వ్యాన్ నడుస్తువుంది.

మధ్యన చింతపల్లి దగ్గర ఓ వ్యక్తి చేతిలో ఎర్రని జండా పట్టుకుని వచ్చిపోయె లారీలను ఆపుతువున్నాడు. తమకంటె ముందొచ్చిన భర్తీ లారీని

ఆపి, ఏదో రిసిట్ అతనికిచ్చి అతను ఇచ్చిన డబ్బును అందుకున్నాడు మరో వ్యక్తి. లారీ కదిలింది దాని వెనకే వ్యానొచ్చి ఆగి, "పోవాలా ఆపాల" అడిగింది. పట్టణం వెలుపల బండి నడపడం ఆమెకు ఇదే మొదటిసారి.

"ఇది చెక్‌పోస్ట్, లారీలను మాత్రమే ఆపుతారు. మనం పోవచ్చు అనుకుంట" అంది రజని చెక్‌పోస్టు వాళ్ళ వైపు చూస్తూ.

రోడ్డు పక్కమ్మటె వరిగడ్డిలో అక్కడున్న అదె చెక్‌పోస్టుకు సంబంధించిన మరో వ్యక్తి వేరు శనగకాయలను కాలుస్తు వున్నాడు. అది చూసి వ్యాన్ పక్కకు ఆపారు. నలుగురు కిందికి దిగుతు - "మాకేమన్నా ఇస్తారా?" అని అడిగింది స్వాతి వాళ్ళ వైపు హంసలా నడుస్తూ.

'ఇస్తాం రండి' అని తలాడించాడు ఇందాక రిసీట్ ఇచ్చిన వ్యక్తి వాళ్ళు దిగినపుడు సెంట్ వాసన గుప్పున వచ్చింది. రిసీట్ బుక్కును అక్కడి టేబిల్ మీదుంచుతు కాలేజి అమ్మాయిలాగున్నారు అనుకుంటు వాళ్లముందుకొచ్చాడు తెల్లని దుస్తుల్లో ఏబదేండ్ల మనిషి.

"నా పేరు స్వాతి, ఈ జీన్స్ పాంటామె సలోమి, ఈ పంజాబి డ్రెస్ ఆమె రజిని, ఆమె శాలిని అని పరిచయం చేస్తు నవ్వుకుంటు కాయలను కాలుస్తున్న మంట దగ్గరికి నడిచి వెళ్ళి నిలుచున్నారు నలుగురు. "అవును లారీలను ఎందుకు ఆపుతున్నారు." అని అడిగింది సలోమి. ఆమె విదేశీ అలంకరణ బాబ్‌డ్ హేయిర్ ఎత్తు శాండిల్స్ మెడలో శిలువ వుంది.

"ధాన్యపు లారీలైతె, వాటికి టాక్స్ వసూల్ చేస్తాం" అన్నాడు.

'అలాగా' అన్నట్టుతల ఊపి "మాకు కాల్చే కాయలన్నీ కావాలి మేం డబ్బులిస్తాం. మీరు తరువాత కొనుక్కోండి" అంది స్వాతి. ఆమె ఆధునిక అలంకరణలో వుంది. సగం కత్తిరించిన జుట్టుకు ప్లాస్టిక్ రింగ్‌లను తొడిగింది. దాని రంగు తాను వేసుకున్న డ్రెస్ రంగులోనే వుంది. నుదుటి బొట్టు అదే రంగులో వుంది.

"డబ్బులేమొద్దు. గీకాయలకు డబ్బులా, మాకు మస్తు" అంటూ ఆ కాయలను తీసి బూడిదను వేరు చేసి, పేపరులో కట్టిచ్చాడు. కాయలను కాల్చే వ్యక్తి. "థ్యాంక్స్" అంటు వాళ్లకు ఓ ఐస్‌క్రీమ్ ప్యాక్ ఇస్తు మీ పేరేంపేరు అంకుల్" అని అడిగారు. ఆయన తన పేరు అంజయ్య అని చెప్పాడు. తాము చేతుల్లోకి తీసుకున్న కాయలను గిల్లి నోట్లో వేసుకుంటు మరొకసారి థ్యాంక్స్ చెపుతు వ్యాన్ దగ్గరికి వెళ్లిపోయారు. వ్యాను కదిలింది. గ్రామీణ వాతావరణం చూస్తు వుంటే వాళ్ళకు కళ్ళ సంభూరంగా వున్నట్టు వాళ్ళ చూపులే చెపుతున్నాయి.

కొంతదూరం వెళ్లాక గొర్లమంద అడ్డంరాగ బండిని స్లో చేసుకుని పక్కమ్మటి దాటిపోయారు. ఆ తరువాత మల్లేపల్లి దగ్గర ఓ గేదెల గుంపు ఎంత హారన్ ఇచ్చిన వ్యాను ఓ భంగీన ముందుకు సాగనీయలేదు. ఎంతో సేపటికి గాని వాటిని దాటలేకపోయారు. వాటిని కాచేవారు కర్రలను భుజాలమీద వుంచుకుని వాటిని పట్టించుకోకుండా పక్కెమ్మటి నడుస్తూ వున్నారు.

రోడ్డు పక్కమ్మటె ఓ వ్యవసాయ పంపు, నీళ్లు పోస్తూ వుంది. పాతికకు పైనే వున్న ఓ యువకుడు స్నానం చేస్తుంటె ఆయన బార్య అతని ఒల్లు రాస్తూ వుంది. "ఆ శృంగార దృశ్యాన్ని క్లిక్ మనిపించే సలోమి" అంది స్వాతి. వ్యాన్ ఆపి ఫోటో తీసారు. కాళ్ళు చేతులు కడుక్కునే వంకతో నలుగురు పంపు చుట్టు చేరారు. అతని నడుంకు చిన్న గుడ్డ మాత్రమే వుంది. "రోడ్డు పక్కన ఇట్లనా" అంటు కదిలే ముందు, పంపు అంచున వేళ్ళుంచి ఆ ఇద్దరి మీద నీళ్ళు చిమ్ముతూ వుంటే బార్య "ఏయ్ వద్దు వద్దు" అని చేతులు అడ్డం పెట్టింది. వాళ్లు వెళ్లిపోతున్నపుడు అదో మాదిరిగా వాళ్ళ వైపు చూస్తూ తన సిగను విప్పి "తు తు" అంటు దిష్టి తీసింది. భర్త నవ్వుతు వాళ్ళ వైపే చూస్తూ వున్నాడు. వాళ్ళు మళ్ళీ మళ్ళీ అతన్నే చూస్తూ వున్నారు. వంటి విరుపును అణచుకోవడానికి ఒకరినొకరు కొట్టుకొంటు నడుస్తు వుంటే "బరితెగించిన మిడతలు" అంది వాళ్ళు పోతున్న వైపే చూస్తు భార్య.

'భలే సీన్‌లే' అని అనుకున్నారు నలుగురు. అవును ఆడవాళ్ళను నగ్నంగా ఫోటోలు తీయంగా, మగవాళ్ళను అర్ధనగ్నంగా తీస్తే తప్పా. అంది సలోమి. కంట్రిమ్యాన్ ఎట్లా వుండు చూడు అని నలుగురు చూపులతో నవ్వుకున్నారు.

అక్కడక్కడ గిరిజన తండాలు. తండాల్లోని ఇండ్లముందు దాన్యాన్ని దాచిన గుమ్ములు. రోడ్డుకు ఇరుపక్కల అక్కడక్కడ పండ్ల తోటలు. వాటిని దాటి వ్యాన్ సాగర్‌వైపు పరుగెత్తుతువుంది. గెట్టున మేస్తున్న పశువులు, పైన ఎగిరె పక్షుల గుంపులు, మబ్బుల చాటున సూర్యుడు ఉండడం వల్ల వెండి ముద్దలు అతుక్కున్నట్టు ఆకాశం. వాటి మధ్యన బంగారు బిళ్ళలా సూర్యుడు. స్వచ్ఛమైన గాలి పొలాలలో. కల్లా కపటం ఎరుగని మనుషుల కదలికలు. గట్ల మొదట్లో మేస్తున్న మేకలు, గొర్లు. వాటి వెనకాల వాటి కాపర్లు. చూడముచ్చటైన ప్రదేశంను చూస్తు మురిసిపోతువున్నారు. వ్యాను పొట్టిచెలిమ దాటి మొదటి గుట్టను ఎక్కుతున్నప్పుడు లెఫ్ట్ కెనాల్ మొదలైన వైపు చూసారు. అక్కడ నీరు తక్కువగా వుంది. అక్కడే టన్నల్ మొదలైంది. మంచం మీద పాతికేండ్ల యువకుడు వడిసేలను రువ్వగా రాయొచ్చి వ్యానుకు తగలడం, వ్యాను ఆపి,

నలుగురు దిగి మంచె వైపు నడిచారు.

0 0 0

అది నాగార్జున సాగర్ నుండి హైద్రాబాదు తిరిగి వచ్చేటప్పుడు వెళ్లే రోడ్డు, మధ్యన పెదవూర. అది మండల కేంద్రం అక్కడ పోలీసు స్టేషను వుంది. సాగర్ నుండి అతి వేగంగా దూసుకొస్తుంది మారుతి వ్యాను. ఆపడానికి నడిరోడ్డులో నిలుచున్న జవానును అతి చాకచక్యంగా తప్పించుకుపోయే ప్రయత్నం చేసింది స్వాతి. స్టేషన్ వరండాలోకి వుండి అది గమనించిన ఎస్.ఐ. మోటారు సైకిల్‌పై వెంబడించి ఊరవతల అడ్డు తిరిగి ఆపి, వెనకకు మళ్లించాడు. అందులో వున్న నలుగురిని దింపి స్టేషన్ వరండాలో తీసుకొచ్చాడు. వేటగాడు కౌంజులను పట్టి పంజరంలో వేసినపుడు బెదిరి చూసినట్టు చూస్తు వున్నారు నలుగురు. వాళ్ల చూపుల్లో ఏదో బెదరు!

"వ్యాన్‌ను ఆపేది చూసి కూడా తప్పించుకుని పోవాలని చూశావెందుకు" అని అడిగాడు యస్.ఐ. వ్యాను నడిపిన అమ్మాయిని తీవ్రమైన చూపులతో సమీపిస్తూ.

అమ్మాయి నోరు విప్పలేదు. మిగిలిన ముగ్గురమ్మాయిలు అంతే మౌనంగా నిలుచొని ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటు మధ్య మధ్య యస్.ఐ. వైపు పోలీసుల వైపు చూస్తువున్నారు. పోలీసులకు కూడ విషయం అర్థం కాక ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు. యస్.ఐ. మాత్రం 'నాకంత తెలుసు' అన్నట్టు ఓ పోలీసు చూపు! ఆయన చూపులకు వాళ్లు బెదిరి బెదిరి చూస్తువున్నారు. యస్.ఐ. వరండాలోనుండి తన రూంలోకి నడుస్తు లోనికి రమ్మని సైగ చేసాడు తన చేతిలో వున్న కర్రతో! వాళ్లు నలుగురు భయాన్ని నటిస్తూ లోపలికి నడిచారు.

యస్.ఐ. తన కుర్చీలో కూర్చుంటూ తన చేతిలోని కర్రను టేబిల్ మీద ఉంచాడు.

వాళ్ళను ఎదురు బెంచిలో కూర్చోమని సైగ చేశాడు. వాళ్లు అతి వినయాన్ని నటిస్తూ కూర్చున్నారు. వ్యాను నడిపిన యువతివైపు పోలీసు చూపు చూస్తూ.

"పి.సి. ఆపుతు వుంటె నీవు ఎందుకు ఆపలేదు" కళ్ళు పెద్దవి చేసి చూస్తూ అడిగాడు.

"నేను గమనించలేదు సార్" అంది చిన్నగా చేతులు కట్టుకుంటు పక్కన వున్న తుపాకుల స్టాండు వైపు చూస్తూ. మిగతా ముగ్గురు కూడ వాటి వైపు భయంగా చూసారు.

"అదేమిటి బండి నడిపేవాళ్ళకు ఎవరు అడ్డం వచ్చేది, ఎవరు ఆపేది చూడకుండ నడిపితె ఎట్లా?" అని అడిగాడు గొంతులో కొంత కాఠిన్యం ధ్వనించింది.

మరో పక్క గోడకు నేరస్తులకు వేయవలసిన బేడీలు కనిపించాయి. వాటిని చూడగానె వాళ్లల్లో బెరుకు చోటు చేసుకుంది.

"ఏం చేస్తున్నావు" కాస్త గట్టిగా అడిగాడు.

"చదువుతున్నాం" పర్స్‌లోని ఐడెంటిటి కార్డు తీసిచ్చింది. అది చూసి యస్.ఐ. రెప్పలు కాసేపు నిలబడ్డయి.

"మీ నలుగురునా" అడిగాడు మిగతావాళ్ల వైపు పరిశీలనగా చూస్తూ.

అవును అన్నట్టు తలాడించింది. నలుగురి వైపు సానుభూతిగా చూస్తు "మరి ఎందుకర్ర వెయికిల్ అంతరాశగ నడిపారు" అని/ఆరాగా అడిగాడు.

నలుగురు బిక్క మొహం వేసి చూస్తు 'సారీ సర్' అంటు స్వాతి పర్సులోని కొన్ని నోట్లు తీసి టేబుల్ మీదుంచింది. రిక్వెస్టుగ చూస్తూ మిగిలిన ముగ్గురిది అదేచూపు!

"అబ్బే అదేం కాదు మీ పాకెట్‌మని నాకెందుకు మీరె వుంచుకోండి" అంటు వాపసు తీసుకోండి అంటు కళ్లతో సైగచేసాడు. కాని వీళ్ల పరుసుల్లో అన్నీ పచ్చనోట్లే, తీసుకున్న తప్పులేదు అని కూడ అనుకున్నాడు మనసులో. కొంగ చేప పిల్లలను చూసిన చూపు కళ్లల్లో కదిలింది.

"ఏయ్ రంగయ్యా" అంటు పిసిని పిలిచాడు. అతనొచ్చి సైల్యూట్ చేసాడు. ఆరోజు సెల్‌లో ఎవరు లేరు. అప్పుడే పీసీలు డూటీ మారుతువున్నారు.

'అమ్మయ్య ఇక వదిలేసేట్టుంది' అనుకుంటు ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుంటు నిట్టూర్చారు.

"సరే" అంటు చేతిని లేపి తలకానించి వెళ్లిపోయాడు. పోతు పోతు అన్నా పడతల్ పడ్డట్టుంది వదిలేస్తువుండు. లేకపోతేనా ముందే ఆడవాళ్లు అనుకుంటు మెట్లు దిగెటప్పుడు సెంట్రీ ఎంటంటా బ్రోతలా" అని అడిగాడు.

"ఛీ నీకెప్పుడు అటువంటి ఆలోచనలే, కాలేజీ పిల్లలు" అంటు కసురుకొని బజారువైపు నడిచాడు. అనడానికి అన్నాడు కాని రంగయ్యా చూపు కూడ కోడిపిల్లలవైపు పిల్లిచూసినట్టు చూసాడు.

ఎదురుగా వున్న ఫోన్ మోగింది. యస్.ఐ. రిసీవర్ ఎత్తి

"హల్లో" అన్నాడు.

"పోలీసు స్టేషనాండి" అవతలికంఠం.

"యస్, చెప్పండి" అన్నాడు మామూలుగ, కాని నలుగురమ్మాయిల గుండెలు జల్లుమని లబ్‌డబ్‌ల వేగం పెరిగింది. బెరకు కదిలింది.

"నేను హాస్పిటల్ ఆర్‌యంఓను మాట్లాడుతున్న యస్.ఐ. గారు కావాలి"

"మాట్లాడుతున్న, అన్నాడు వీళ్ల కళ్లల్లో బెదురును ఓ కంట కనిపెడుతూనే"

"హైదరాబాద్‌వైపు ఓ మారుతివ్యాన్ వస్తుంది దాన్ని ఆపేయండి" అంతె కాళ్ళలో వణుకు మొదలైంది. అయినా నిలదొక్కుకునే ప్రయత్నంచేస్తూ వున్నారు.

"ఎందుకని" ఆరా తీసినట్లు అడిగాడు.

"నేను తరువాత చెపుతాను ముందు దానిని ఆపేయండి"

యస్.ఐ. ముఖ కవళికలను కనిపెడుతువుంటె, వాళ్ళ ముఖకవలికల్లోను భయాందోళనలు కదులుతువున్నాయి. చెమట వాళ్ళ ముఖంలో చిమ్ముతువుంది.

నలుగురు దగ్గరవున్న నోట్లన్నీ టేబుల్‌మీద కుప్పబోసి "మమ్ముల వదిలేయండి సార్" అంది సలోమి "వదులుతానమ్మ మీ పర్సుల్లో సెల్‌ఫోన్లున్నాయా, వాటిని బేబుల్ మీదుంచండి" అన్నాడు తనచేతిలోని లాఠీని టేబుల్‌మీద టకటక మనిపిస్తూ.

ఫోన్‌వచ్చినాక ఆయన మాటల్లో వచ్చినమార్పునుచూసి నలుగురు తమ సెల్‌ఫోన్లను టేబుల్‌మీదుంచారు. వాటిని డెస్క్ అరలో బద్రపరచి "ఈ ఫోన్‌లొచ్చి అక్రమసంబంధాల అడ్రస్ తెలవకుండా చేసినయి. సాక్ష్యాలు కరువైనయి. ఎవరు ఎవరితో మాట్లాడేది తెలుసుకోవడం కష్టం!

"ఏమిటి సంగతి. ఎక్కడినుండి వస్తున్నారు?" అని అడిగాడు నింపాదిగా.

"సాగర్ డ్యామ్‌ను చూడడానికి వెళ్లాం సార్"

"చూసారా? నీళ్ళు ఏమాత్రమున్నవి" అంటు నలుగురి ముఖాలలోకి క్యారంబోర్డు మీద కాయిన్స్‌ను గురిగా చూసినట్లు చూస్తు అడిగాడు.

"మేము అటువెళ్ళనేలేదు సార్" స్వాతి సలోమి ఒకేసారి అన్నారు. మిగతావాళ్ళు 'అవును' అన్నట్లు చూశారు.

"మరీ ఆర్‌ఎంఓ ఎందుకు ఫోన్‌చేశాడు. ఇప్పుడే మీ ముందు మాట్లాడింది ఆయనే" అన్నాడు. వాళ్ళ ముఖాల్లోకి పరిశీలనగా చూస్తూ ఏదో జరిగినట్లుంది అన్న అనుమానంతో నలుగురు బిక్కముఖం వేసారు. తెలియదు అన్నట్లు చూసారు. దు:ఖం తన్నుకొస్తుంది.

మొత్తంమీద ఏదో కథ వున్నట్లుంది. లేకపోతే ఆర్‌ఎంఓ ఫోన్ ఎందుకుచేస్తాడు. ఏది ఏమైనా కేసును చాలా జాగ్రత్తగా డీల్‌చేయాలి. కూల్‌డ్రింక్స్ వొచ్చాయి. అయిష్టంగానే మింగుతున్నారు. టేబుల్ మీదున్న ఓ

ఐదొందల నోట్‌తీసి పి.సి.కిస్తూ, "వీళ్లను వాళ్ళ వ్యానులోనే తీసుకెళ్ళి గెస్ట్‌హౌస్‌లోనే వుంచు. వెళ్ళండి ఇక్కడవుంటె బాగుండదు. ఓ గంట తరువాత వెళ్లుదురుకాని, వ్యాన్‌ను అక్కడెవుంచండి. ఎవరికి తెలువద్దు" అన్నాడు. మనస్సులో ఏదో పథకం వేస్తున్నట్టు ముఖం చెపుతునేవుంది.

"మేంఏతప్పు చేయలేదు సార్. మమ్ముల వదిలేయండి ప్లీజ్, అని ప్రాధేయపడ్డారు. నలుగురు కళ్లనీళ్ల కుక్కుకుంటు వ్యానెక్కారు. వ్యాన్‌ను గెస్ట్‌హౌస్ వైపు తీసుకెళ్లాడు పిసి.

వాళ్ళు వెళ్లగానె ఆసుపత్రికి ఫోన్‌చేశాడు.

'బాతు బంగారిగుడ్లు గుర్తొచ్చింది'.

స్వాతి విజిటింగ్ కార్డు తీసుకుని వాళ్లింటికి ఫోన్ కలిపాడు.

"హల్లో" అవతలి కంఠం

"మీరెవరండీ" అవతలిగొంతు.

"స్వాతితో మాట్లాడాలి"

"మీరెవరో చెప్పరు" అదో స్త్రీ గొంతు

"చెప్పండి చెప్పరా నేను ఆవిడ తల్లిని"

"అవునండి అవతలి వ్యక్తి ఎవరో తెలియంది ఎట్లా చెపుతాం. మీరెవరో చెప్పండి"

"నేనెవరో తరువాత చెపుతాను మీ స్వాతి మాళ్ళదగ్గరవుంది అని చెప్పడానికి ఈ ఫోన్"

"మీరెవరండి ఎక్కడి నుండి"

"అన్నీ అంత తొందరగా చెపితె ఎట్లా"

"నాలుగు ఒకట్లు గల మారుతి వ్యాన్ మీదేనాండి" కొంచం సాగతీసినట్టు అడిగాడు.

"అవును, ఏమన్న యాక్సిడెంట్ జరిగిందా" ఆతురుతగ అడిగింది.

"గాబరాపడకండి అలాంటిదేం జరగలేదు అందరు క్షేమమే గాని, ఆపదలో వున్నారు".

"ఇంతకీ మీరెవరో చెప్పడంలేదు" అంది.

"చెపుతాను. వట్టిగానె చెప్పాలా?"

"అంటే మా అమ్మాయిలను కిడ్నాప్‌చేసారా? ఏమనకండి బాబు" అంది ఆందోళనగా.

"ఏమనకుండా వుండాలంటే మీరు రండి వచ్చి మీ అమ్మాయిని

తీసుకెళ్ళండి. మిగతా ముగ్గురిండ్లకు ఫోన్‌చేసి వాళ్లనుకూడా సొమ్ముతో రమ్మనండి. మీ వ్యాన్ నెంబరు నాలుగు ఒకట్లు. అందులో నలుగురు అమ్మాయిలు నాలుగు పాతికలు. ఒకటి పట్టుకురండి. ఈ విషయం ఎవరికి చెప్పొద్దు. పోలీసులకు తెలియొద్దు. తండ్రులు, అన్నదమ్ములు ఎవరు రావొద్దు. ఒక్క తల్లులు మాత్రమే రావాలి. సరేనా?" అన్నాడు. తన పథకం పారుతుంది అనుకుంటు.

"అట్లాగే" అంది చెపితే ఏంచెడు జరుగుతుందో అనుకుంటూ.

మీరు రావాల్సిన స్థలం పెద్దవూర, ప్రాజెక్టు గెస్ట్‌హౌస్. ఈ పెద్దవూర - హైద్రాబాద్ నుండి సాగర్ వెళ్ళె దారిలో వుంటుంది. అది కూడ ఓ మండల హెడ్‌క్వార్టర్ కూడ. ఆ గెస్ట్ హౌస్‌కురండి.

ఇంకా ఏమన్న తెలుసుకోవాలంటే నా సెల్‌నెంబర్ 9876543210. పోలీసులు వెంటవున్నా, మీ మగవాళ్ళు వెంటవున్న మీవాళ్లకే ప్రమాదం మీరు పువ్వుల్లో తెస్తే నేను వాళ్ళను నవ్వుల్తో అప్పచెపుతా సుమా.

"సరె" అని స్వాతి తల్లి ఫోన్ పెట్టేసింది.

స్వాతి తల్లి జానకి మిగతా ముగ్గురిండ్లకు ఫోన్ కల్పి తన ఇంటికి రమ్మంది సలోమి తల్లి. లూసి మిగతా ఇద్దరిని తన కారులో తీసుకరమ్మని చెప్పింది. లూసి అలాగె ఇద్దర్నీ తీసుకుని జానకీదేవి ఇంటికి చేరింది. అది ఓ పెద్ద ఆధునిక రీతుల్లో నిర్మించిన బంగళ పోర్టికోలో కారు ఆపి లోపలికి నడిచారు. నలుగురు తమ పిల్లల గురించి చర్చించుకున్నారు. నలుగురికి నలుగురు తల్లి, తండ్రిని లెక్కచేయకుండా తిరుగుతున్నారని, ఎప్పుడు టి.వి.నే చూస్తూ కూర్చుంటున్నారని, ప్రైవేటు క్లాసులని పార్కులకు వెళుతున్నారని వీళ్లకో అద్దుపద్దు లేకుండా పోతుందని, పెళ్లీలు చేసుకొమ్మంటె తొందరేమొచ్చిందని ఎదురు చెపుతున్నారని, తమ తమ సొదలను వెళ్ళపోసుకున్నారు. తల్లులుగా తమ తమ బాధలను కాసేపు కలెపోసుకున్నారు. అడగ్గానే అయ్యలిచ్చే డబ్బుగూర్చి అంగలార్చారు కాసేపు. ఆ తరువాత అన్నీ దిగమింగుతు గొంతు సవరించుకొని జానకి-

"సరే మన బాధలు మనకున్నయి. వచ్చినాక మాట్లాడుకుందాం. ముందు మనం వెళ్ళి పిల్లలను తీసుకొచ్చుకుందాం. ఆలస్యమైతే ఏదైనా జరగొచ్చు. వాడు లక్ష రూపాయలు తీసుక రమ్మన్నాడు. ఆ విషయం నేను మీకు ఫోన్‌లో చెప్పకూడదని చెప్పలేదు. తరువాత ఇదురు కాని నేను తెస్తాను" అంది జానకి.

"సరే కానియ్యండి తప్పుతుందా" అంది లూసి. మిగతా ఇద్దరు 'సరె' అని తలాడించారు.

"ఇంతకు వాడు ఎవడై వుంటాడు" అని అడిగింది లూసి.

"తెలియదు. సెల్‌నెంబరిచ్చాడు. మనం చేరవలసిన అడ్రస్ చెప్పాడు" అని తాను రాసిపెట్టిన చీటిని ఇచ్చింది.

"సెల్ నంబర్‌తో ఎవరైంది ఎట్లా తెలుస్తుంది" అంది రజని తల్లి సీత.

'అవును' అన్నట్టు తలలూపారు మిగతావాళ్ళు.

"మనం అవన్ని ఆలోచిస్తూ కూర్చుంటె వీళ్ళ రానట్టుందని వాడు-"

జానకి గదిలోకి వెళ్ళి ఓ బ్రీఫ్‌కేస్‌తో వచ్చి "పదండి. లూసి నీ కారులోనే" అంది జానకి.

లూసిది ఇండికా కారు. వెళ్లి నలుగురు అందులో కూర్చున్నారు. కారు కదిలి సాగర్ రోడ్డు వైపు పరుగెత్తింది. నగరం దాటింది. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు వున్నారు. తమ పెంపకంలో ఏం లోపాలు జరిగాయా అని ఎవరికి వారు ఆలోచిస్తున్నారు.

అయితే ఎవ్వర్కి చెప్పొద్దు. మగవాళ్ళను తీసుకరావద్దు అన్నాడా?"

"అంతేకాదు పోలీసులకు చెప్పే ప్రయత్నం చెయ్యొద్దు అన్నాడు. తాను ఇచ్చిన అడ్రస్ ఎవరికి తెలియొద్దు. అట్లా ఎవరికన్న చెప్పితె మీ బిడ్డలను మీకు కనపడకుండా చేస్త అని గూడ అన్నాడు. వాడన్నవి అన్ని బెదిరింపు మాటలే" అంది జానకి.

మన ఇంటి వాళ్లలో ఎవరు పోలీసు ఆఫీసర్ కారైరి. అసలు వాళ్ళు అన్నతమ్ములు లేకుండా వంటరిగా ఎందుకు పోయినట్టు. ఈ ఆపద, ఈ అవస్త ఏంది?" అంది సీత.

"మా ఆయన ఐటి ఆఫీసర్ కద, ఆయన పోలీసు కమీషనర్‌కు చెపితె వినరా?" అంది లూసి

"అట్లంటే ఈయన ఎక్సైజ్ ఆఫీసర్ కాదా? ఈయన కూడ చెప్పొచ్చు ఆయన ఆ విషయం తండ్రులకు చెప్పొద్దు అన్నాడంటివి కదా" అంది సీత.

"అవును అంది జానకి తన భర్త పెద్ద కాంట్రాక్టర్ ఎదంటె అది చేయగలదు కాని వాడట్ల చెప్పే అనుకుంది"

ఇంక శాలిని తల్లి 'తన భర్త చెపితె వ్యాపారస్తులు తప్ప మరెవరు ఇనరనుకుంటా అనుకుంట అనుకుంది. ఎందుకంటే ఆమె భర్త స్టేట్ ఆఫీసర్!

"ఈ పిల్లలు ఇట్లా తయారైండ్రు ఏం చేద్దాం లూసి" అంది జానకి.

"మన చిన్నతనం రోజులు కావు. చేసేది ఏం లేకనె కదా ఇట్లా తయారైంద్రు." అంది లూసి

"ఏంది చేసేది పెండ్లిల్లు చేస్తే అన్నీ సర్దుకపోతయి" అంది సీత

"శాలినికైతే ముక్కుమీద కోపం. ఏం అంటే ఏం చేసుకుంటరో అని భయం" అంది తల్లి భారతి.

"నలుగురికి నలుగురు అంతే తండ్రులేమో పెద్ద పెద్ద ఆఫీసర్లు బిడ్డలేమో కోతులు తయారైరి" అంది జానకి.

"ఒకే తీరు మనస్తత్వం కనకనే కలిసి తిరుగుతున్నరు" అన్నది భారతి భారంగా.

కారు నడుస్తువుంది. అయ్యలేమో ఆఫీసర్లు పిల్లలేమో పిచ్చివేశాలు వేస్తున్నారు.

తమ పిల్లల గూర్చి వాళ్ల మనస్తత్వం గూర్చి వాళ్ల వేష భాషల గురించి చర్చించుకుంటున్నారు.

మల్లేపల్లిలో రోడ్డు పక్కమ్మటి సీతాఫలాల గంపలు కనిపిస్తె ఓ గంపను కొనుక్కొని కార్లో పెట్టుకున్నారు. కారు పెద్దవూర శివార్లలోకి చేరుకుంది. జానకి సెల్‌కు ఫోన్ చేసి చేరుకున్నాం వస్తున్నాం అని గెస్ట్ హౌజ్ ఎటు వైపు ఉందో అడిగి తెలుసుకుంది.

"ఏది ఏమైనా మనం ఇంట్లోకొచ్చె డబ్బు చూస్తున్నామే కాని ఇంట్లోని పిల్లలు ఎటుపోతున్నది చూస్తలేం" అంది జానకి.

"నాకదే అనిపిస్తుంది. ఇక మొగపిల్లల సంగతి చెప్పనక్కరలేదు" అంది భారతి బరువైన శ్వాసను పీల్చుతు.

0 0 0

ఇండికా కారు వచ్చి పోలీసు స్టేషన్ ముందాగింది.

సంత్రి పొజిషన్‌లో నిలుచున్నాడు.

నలుగురు ఒకేసారి స్టేషన్ మెట్లవైపు నడుస్తున్నారు. నలుగురు నడి వయస్సు వాళ్ళే ఖరీదైన బట్టలు ధరించివున్నారు. వాళ్ళు వేసుకున్న జోళ్లు అక్కడి ఎగుడు దిగుడు నేలన కదల్లేక కదులుతున్నాయి. గాజులు గడియారాలు ఒకటేమిటి ఒక్కొక్కరు లక్షలకు పైగా నడుస్తున్నారు.

"యస్.ఐ. గారున్నారా అండి" అంటూ సలోమి తల్లి.

వున్నరన్నట్టు తల వూపాడు సెంట్రి.

నలుగురు లోపలికి నడుస్తూ వుంటె ఇంతకుముందు వచ్చినవాళ్ళు దూడలైతే

వీళ్లు ఆవుల్లా వున్నారని పోలీసు భాషలో అనుకున్నాడు సెంట్రి.

తన వైపు వస్తున్న వాళ్ళ వైపు చూస్తు 'రండి రండి' అన్నాడు యస్.ఐ. లోపలికి రాగానే బెంచిమీద కూర్చోండి అన్నట్టు చేత్తో చూపించాడు.

'బెంచిమీదనా' అన్నట్టు చూసారు నలుగురు. తాము కట్టుకున్న చీరెలను తడిమి చూసుకుంటూ.

"కూర్చోండి ఇది పోలీసు స్టేషన్ అందులో ఓ పల్లెటూరులో ఇంతకంటె మంచివి వుండవు" అంటూ ఓ నవ్వు నవ్వాడు యస్.ఐ. వాళ్ళు అయిష్టంగానే కూర్చున్నారు.

"మీరు పెద్ద పెద్ద ఫ్యామిలి వాళ్లున్నట్టున్నారు. చెప్పండి మీకేమి సేవచేయగలమో" అన్నాడు వినయంగా యస్.ఐ. తనకు ఏం తెలియనట్టు చూస్తు

"సేవలు కాదు తండ్రి మమ్ముల సేవ్ చేస్తే చాలు" అన్నారు ఒక్కసారె నలుగురు.

"విషయం చెప్పండి" అన్నాడు ఎదురుగ ఉన్న గడియారం వైపు చూస్తూ.

"మా అమ్మాయిలు ఈ ఊరి గెస్ట్‌హౌజ్‌లో వున్నారట. వాళ్లను తీసుకపోవడానికి వచ్చాము" అన్నది జానకి.

"మీ అమ్మాయిలు, ఈ ఊరి గెస్ట్‌హౌస్‌లో! మీరు తీసుకపోవడానికి వచ్చారు! తీసుకపోండి మధ్యన మేమెందుకు" అన్నాడు నింపాదిగ యస్.ఐ. టేబుల్ సొరుగు వైపు చూస్తూ.

"ఈ ఊళ్లో ఉన్నారంటున్నారు ఎవరు చెప్పారు. మీ అమ్మాయిలు ఫోన్ చేశారా?" కూపి లాగినట్లు అడిగాడు.

"ఫోనే చేశారు. కాని అమ్మాయిలు కాదు ఎవరో వేరే వ్యక్తి. తన పేరు చెప్పలేదు. తాను ఫోను చేసినట్టు ఎవరికి చెప్పొద్దన్నాడు"

"మరి మీరు పోలీసులకే చెపుతున్నారుగ" తన చేతిలోని కర్రవైపు చూస్తూ అన్నాడు.

"ఎటొచ్చి ఎటు పోవునో ఎందుకైనా మంచిదని" అంటున్నపుడే ఫోన్ మోగింది. రిసీవరెత్తి–

"హల్లో"

"యస్.ఐ. గారా అవతలి" కంఠం.

"మాట్లాడుతున్న"

"ఆ అమ్మాయిల వ్యాను వెళ్లిపోయిందా నేను ఆర్‌ఎమ్మోను".

'ఈయన మాట మాటకు వ్యాను గురించి అడుగుతున్నాడు ఏంటి సంగతి. ఏదో పెద్ద కథ జరిగినట్టుంది! కేసు పెడితే క్యాష్ రాదు. రోగి బెడ్ మీదున్నప్పుడే బిల్ వసూల్ మంచిది'! అనుకుంటూ

"ఇప్పుడే ఇక్కడినుండి పోయింది. ఎందుకు ఏం జరిగింది. వెంబడించి తీసుకురావాల?"

"ఆ అవును"

"ఎందుకని"

"వాళ్లు ఓ అత్యాచారం జరిపి తప్పించుకొని వస్తున్నారు"

ఫోన్ సంభాషణ వింటు వున్న తల్లుల మనస్సులో ఏదో కీడు జరిగినట్టు అనిపిస్తు వుంది. ఒక్కసారె బరువైన నిట్టూర్పులను వొదులుతు కదిలి కూర్చుంటు ఎస్.ఐ. ముఖ కవలికలను పరీక్షగా చూస్తు వున్నారు.

"వాళ్ళపై అత్యాచారమా"

తల్లులు ఊపిరి బిగబట్టి చూస్తు వున్నారు. అవతలి కంఠం చిన్నగా వినపడుతుంది.

'వయస్సులో వున్న పెళ్లిగాని పిల్లలు నిజంగా ఏదన్న జరిగితె బతుకులు బజారుపాలె! ఏం జరగకుండా వుంటే మంచిది' అని మనస్సులో తమ తమ ఇష్టదేవతలకు మొక్కుకుంటున్నారు.

"కాదు వాళ్లే అత్యాచారం చేసారు"

యస్.ఐ. ముఖంలో వింతైన మార్పులు. "మీరు ముందే ఎందుకు చెప్పలేదు" అన్నాడు మాటల్లో ఆదుర్దాను పలికిస్తు.

"పరీక్షలు అవి చేయందె" అన్నాడు డాక్టరు.

తల్లడిల్లుతున్న తల్లుల ముఖాలలో రక్తం ఇంకిపోతువుంది.

"మీరు వివరాలు చెపితె, వాళ్లను వెంబడించి అరెస్ట్ చేస్తాను" అన్నాడు సీరియస్‌గా.

తల్లుల గుండెలు జల్లుమన్నాయి.

"వాళ్లు ఓ గిరిజన యువకునిపై అత్యాచారం చేసి పారిపోయి వస్తున్నారు".

'ఓహో అదా సంగతి. వీళ్ల విషయం నేను చూసుకుంటాలే అనుకుని' "ఈ విషయం మీరు ముందే ఫోన్ చేసినపుడె చెపితె ఈపాటికి అరెస్ట్ చేసేవాన్ని కదా? వ్యాన్ నెంబర్ చెప్పండి" అన్నాడు ఆదుర్దాగా పెన్నును చేతిలోకి తీసుకుంటూ.

"ఆ యువకునికి చదువురాదు. చేను కావలి వున్నాడు. ఆతన్ని చేలోకి

తీసుకెళ్ళి వీళ్లు నలుగురు నాలుగు రకాలుగా గుర్తులు కనిపిస్తున్నాయి. అతని వల్లంతా బీరు వాసనె. అక్కడ ఖాళీ బీరు బాటిల్స్ కూడ వున్నాయట. ఈయనను తీసుకొచ్చిన ఫారెస్టు వాళ్లు చెప్పారు".

తల్లుల తలలు తిరిగినట్టు అనిపిస్తే కణతలను పట్టుకున్నారు.

"ఈ రివర్స్ తతంగం వినటం ఇదే మొదటి సారి సార్. ఒక యువకున్ని నలుగురు అమ్మాయిలు పట్టుకునే ప్రయత్నం చేస్తా, వాళ్ల సిటిలోకి ఎంటరయితే ఇక అంతే కలుస్తాను సార్" అంటూ ఫోన్ పెట్టేశాడు. తన ప్లాన్‌ను ఓసారి మనస్సులో మననం చేసుకున్నాడు. బంగారు బాతులు అనుకున్నాడు.

తల్లుల కళ్ళల్లో తడి ఊరుతూ వుంది. శరీరాలలో రక్తపోటు పెరుగుతూ పెదవులు కంపిస్తున్నాయి. మాత్రం కాస్త ధైర్యంగా చూస్తూ వుంది.

"విషయం అర్థమైందనుకుంటా, ఎంత దారుణమో! ఆలోచించండి." అన్నాడు.

మాట్లాడకుండా కొంత సేపు మౌనంగా వుండిపోయారు.

యస్.ఐ. కుర్చీలోనుండి లేచి బయటికి నడుస్తూ "సెంట్రీ ఫోన్ చూస్తు వుండు గంటలో వస్తాను పదండి" అంటు లేచి బయటికి నడిచాడు. వాళ్లు బారంగా అడుగులేస్తూ అనుసరించారు. వెళ్ళి కారులో కూర్చున్నారు. లూసి స్టీరింగ్ ముందు కూర్చొని కారు స్టార్టు చేసింది. పక్కన సీటులో యస్.ఐ.

ఇండికా కారు కదిలింది.

0 0 0

"మిమ్ములను పోలీసు స్టేషన్‌కు రావద్దన్నానుగా" బెదిరింపుగా వాళ్ళ వైపు చూస్తూ

"అంటే ఫోన్ చేసింది మీరేనా" అని భయంగా చూసింది జానకీదేవిగారు.

"అవును సెల్ నెంబరిచ్చానుగా. ఆ నెంబర్‌కు చేస్తే మిమ్ములను స్టేషన్‌కు రాకుండా ఎదురొచ్చి నేరుగా గెస్ట్‌హౌజ్‌కు తీసుకెళ్ళేవాన్ని. బతకమ్మల్లాగ వచ్చి మీరు స్టేషన్‌లో కూర్చుంటె- అంతా ఏమనుకుంటారు. మీటర్ పెరుగదు. పోగా మావాళ్ళు మిమ్ముల తినెయ్యాలన్నట్టు చూస్తలేరు" అనగానే ముగ్గురు ఒకేసారి పైటలు సర్దుకున్నారు. 'ఏమైద్ది అన్నట్టు చూసింది సలోమి తల్లి. ఆమె ఇలాంటివాటికి దడిసె రకం కాదు ఆ విషయంలో మొగాళ్లు చెడనపుడు ఆడవాళ్లకేమి' అంటుంది. అందుకే మిగతావాళ్లలాగ తన బిడ్డ గురించి అంతగా కలవరం పడడంలేదు. ఈజిగ తీసుకుంటుంది. ఆమె కదలకుండా కారు నడుపుతోంది.

"మీరే ఎట్లాగైనా మా పిల్లలను కాపాడండి. నలుగురికి నలుగురు పెళ్లికాని పిల్లలు. మీరు చెప్పినట్టె డబ్బు కూడ తెచ్చాము" అంది జానకీదేవి.

"కేసు మీకు అర్థమై వుంటుంది. ఎంత బరితెగింపో చూడండి" అన్నాడు ఎస్.ఐ. అదో మాదిరిగ.

"సర్" అంది లూసి

"చెప్పండి" అంటు వెనక్కు మళ్లాడు.

"రెండు చేతులు ఇష్టంగానో అయిష్టంగానో షేక్‌హ్యాండ్ ఇచ్చుకునేటపుడు ఏ చెయిూ ఎక్కువ ఏ చేయిూ తక్కువ కానే కాదు అంతే కాదు ఏ చెయ్యి చెడిపోదూ? ఆ మాటకొస్తే ఎందరు మొగవాళ్ళు రోజు ఎన్ని రేపులను చేసేది పత్రికల్లో చూస్తునే వున్నాం."

"ఓహో మీరట్టొచ్చినారు"

"ఎట్లొచ్చినా ఈ విషయంలో ఎవరికి ఏం నష్టం వుండదు. అన్నీ అనడంలో, అనుకోవడంలోనే వుంది". అంది విషయాన్ని ఈజీగా తీసుకుంటు లూసి. ఆ పరిస్థితుల్లో అంతకంటె ఎక్కువ తోయలేదు ఆమెకు.

"అంటే మీ అమ్మాయిలు చేసిన పనిని మీరు సమర్థిస్తున్నారన్నమాట" నర్మగర్భంగా అన్నాడు.

ఏదో అనబోయిన లూసీని " ఏ ఊర్కోవె, పెంచకు" అంది జానకీదేవి.

"అననీయండి, నేను మిమ్ముల పిలిచి మాట్లాడడం అలుసైంది. వెంటనే బొక్కలోతోసి, కేసు రాసి కోర్టుకు పంపితె అప్పుడు తెలిసొచ్చేది" అన్నాడు కాస్త గట్టిగానే వాళ్ళ వైపు చూడకుండ ముందుకు చూస్తూ. పేరు ప్రతిష్టలున్న వాళ్ళ పిల్లలాగ వున్నారని నేను కేసు రాయలేదు అన్నాడు.

"మీరు అలా అనకండి సార్, మీరు చేసిందేమంచిపని. వాళ్ళేదో పిల్లల ఆట అనుకున్నారు. వాళ్లు నలుగురు తండ్రులు పెద్ద పెద్ద హోదాలో వున్నారు.

ఇది బైటికి పొక్కితె తలవంపులొచ్చేది". అది జరక్కుండా చేశారు. థ్యాంక్స్" అంది.

"అంతెందుకు ఆ డాక్టర్‌కు దొరికిండ్రు అని చెపితె వదిలిపెట్టునా కట్టలకు కట్టలు ఖర్చు అవ్వ పరువుకు పరువు పోవు" ఓ కనుబొమ్మ పైకెత్తి పట్టి లూసి వైపు చూస్తు అన్నాడు.

"సర్, ఇక వదిలేయండి, మా అమ్మాయిలను మాకు అప్పగించండి ఇదిగో మీ బ్రీఫ్ కేస్" అంటు ఇద్దరి మధ్య వున్న బ్రీఫ్‌ను చూపించింది

జానకీదేవి.

"కారాపండి" అనగానే ఆపింది.

బ్రీఫ్‌ను తెరిచి చూసుకుంటు "ఎంత" అని అడిగాడు.

"మీరు చెప్పినంత ఆ విషయంలో మీరు ఏం వర్రి కావద్దు" అంది జానకీదేవి.

"ఏం లేదు నేను నలుగురికి పంచాలిగ" అన్నాడు బ్రీఫ్‌ను మూస్తు. దిగి, బ్రీఫ్‌తో ప్రక్కన వున్న ఇంట్లోకి నడిచి, బ్రీఫ్‌ను అక్కడ ఇచ్చి వచ్చి కారులో కూర్చోని "లెఫ్ట్ పోనీ" అన్నాడు. కారు చెప్పిన మలుపులు మళ్లి గజిబిజి గుంతలన్నీ దాటి గెస్ట్ హౌజ్ ముందాగింది. వాచ్‌మెన్ గేటు తెరిచి చేతులు కట్టుకొని వినయంగా నిలుచున్నాడు.

అందరు లోనికి నడిచారు. వీళ్ళ రాకను చూసి అప్పటివరకు అక్కడ ముడుచుకొని పడుకున్న కుక్క చెవులు జాడిస్తూ లేచి బయటికి పోయింది.

వాచ్‌మెన్ గది తాళం తీయగానే అతనిని యస్.ఐ. బయటికి పొమ్మని సైగ చేసాడు. అతను అక్కడినుండి కదిలాడు. అతని మనస్సులో ఒక్కడు నలుగురిని అనుకుంటు ఆగిపోయాడు. ఎంతైనా గెస్ట్‌హౌజ్ వాచ్‌మెన్ కదా!

తలుపు తెరుచుకొని లోపలికి నడిచారు. తలా ఓ చోట కూర్చున్న వాళ్లు తమ తమ తల్లులను చూడగానే ప్రాణం లేచొచ్చినట్టు కదిలి నిలుచున్నారు. కాని వాళ్ల తలలు నేలను చూస్తు వున్నాయి. తల్లులు వెళ్లి తమ తమ బిడ్డలను కౌగిలించుకున్నారు. కొంత సేపు నిశ్శబ్దం కేవలం ఫ్యాన్ చప్పుడే వస్తుంది ఆ గదిలో. యస్.ఐ. రెప్పవాల్చకుండా చూస్తువున్నాడు. వాచ్‌మెన్ గేటు దగ్గర నుండి లోపల ఏం జరుగుతుందో అని తొంగి తొంగి చూస్తు వున్నాడు. అప్పటికే అతనికి వాళ్లు అన్నం తిని రమ్మని, మందు కొనుక్కొమ్మని వంద రూపాయల నోటు ఇచ్చారు. అతను మొదట నమ్మలేదు. ఆ నోటు మీదున్న గాంధి బొమ్మను చూసి నవ్వుకుంటు తీసుకొని వాళ్ల వైపు చేతులు జోడించాడు. అట్టాగే వాళ్ల పాదాల వైపు చూసి అందరు పెళ్లికాని వాళ్లె అనుకున్నాడు. 'ఇప్పుడొచ్చిన వాళ్ళు వాళ్ల తల్లులైనాలే' అనుకుంటు గేటు దగ్గర చెట్ల మధ్యనుంచి వుంచుకున్న మిగిలిన డ్రింక్‌ను మింగి జేబులో దాచుకున్న మిర్చకాయ బజ్జీని నోట్లో పెట్టుకుంటు, మరొకసారి లోపలికి తొంగిచూసాడు అందరు ఏదో జరగరానిది జరిగినట్టు ఆలోచిస్తూ నిలుచున్నారు.

0 0 0

చేసిన పనిని చెప్పుకోలేని స్థితిలో అమ్మాయిలు.

అడిగి తెలుసుకోలేని తల్లుల చూపుల్లో తల్లడింపు. పర్రె పట్టిన కండ్లు నీళ్లాడినట్టు వాళ్ళ కళ్ళు.

ఇదీ మీ బిడ్డల సంగతి తల్లులార, మీ పిల్లల మీరే రక్షించుకొండన్నట్టు చూస్తు "భర్తల హోదాలను చూసి మురుస్తు, వాళ్లు తెచ్చి ఇచ్చే డబ్బుకు బానిసలై, బట్టలతో బంగారంతో, నగదుతో, నగలతో క్రెడిట్ కార్డులతో, ఎసి కార్లల్లో తిరుగుతు, పిల్లలు ఎటు పోతున్నది చూడరైతిరి. ఏం చేస్తున్నది చూడరైతిరి. వీళ్లేమో బిర్రుగ తిని, తాగి సొరకాయల్లాగ వల్లు చేసి కన్నుమిన్న కానకుండా తిరుగుతున్నారు. ఉప్పుకారం తింటున్న పాణం ఊర్కొనిస్తదా? గదికో టి.వి. అయితే మిడ్‌నైట్ మసాలను చూసి మిడిసిపడుతున్నారు. నీలి చిత్రాలను చూసి నిలిచెటట్టులేదాయె. చిల్డ్రన్స్ బెడ్‌రూమ్‌లని, మాస్టర్ బెడ్‌రూమ్‌లని తల్లి పిల్ల వేరు వేరుగ పడుకుంటు ఎవరి కలలు వాళ్ళు కనుకుంటు కాలం గడుపుతుంటె జరిగేవి ఈ విచిత్రాలే. అయ్యాగార్లేమో క్లబ్‌లకు వెళ్లి పీకలదాక త్రాగి, కాల్‌గర్ల్స్‌తో గడిపి ఇంటి కొచ్చి నిద్రలోకి జారుకుంటుంటె వీళ్లను పట్టించుకునేదెవరు. సెల్‌పోనులొచ్చి విచ్చలవిడితనం పెరిగింది. రమ్మన్న చోటికి పోవడం, ట్యూషన్లని, ప్రైవేటు క్లాసులని, ఫంక్షన్లకని చెపుతు మీ చెవుల్లో పూలు పెడుతున్నారు. ఇంగ్లీష్‌లో మమ్మి డాడి అనగానే మీరంతా చల్లబడి పోతు నోరుమూసుకుంటున్నారు పెళ్ళీడు దాటిపోతున్న మా బేబికి ఏం తొందరొచ్చింది అంటు ముద్దు పెంట్టుకుంటూ వుంటిరి. వాళ్ళేమో హద్దులు దాటిన ఆటలు ఆడుతూ వుండిరి." అంటు గుక్కతిప్పుకోకుండా అన్నాడు. యస్.ఐ ఆ క్షణం యస్.ఐ. వాళ్ల బాధను తన బాధలాగ ఘోషించాడు.

అతను మాట్లాడినంత సేపు అటు అమ్మాయిలు ఇటు తల్లులు బొమ్మల్లాగ నిలుచుండిపోయారు. కాని "ఈయనేందో పెద్ద బోడి ఉపన్యాసం చేస్తున్నాడు. మగపిల్లలైతే ఇష్టం వచ్చినట్టు చేయొచ్చు, ఇష్టమున్న చోట్ల తిరుగొచ్చు తప్పులేదు. అమ్మాయిలు తిరిగితేనే కొంపలు కాలిపోతయి. ఏం మనుషులో వీళ్ళకు ఎందుకింత సీను" అంది స్వాతి వాళ్లకుమాత్రమే వినిపించేటట్టుగ మెల్లగ అటు ఇటు 'చూస్తూ' వీడే ఇంత పెద్దగా చేస్తున్నాడు? ఆ కంట్రీమ్యాన్‌కు ఏం బాగానే వుండొచ్చు, అనుకుంటుంటే వాళ్ల గుసగుసను గమనించిన యస్ఐకి జెర్రులు పారినట్టు అనిపించింది.

"మీరు ఏం చేసి వచ్చారో నాకు తెలుసు. లాకప్‌లో పెడదామనుకున్నాను. మీ వాళ్లొచ్చి కాపాడారు". అన్నాడు తనకంతా తెలుసన్నట్టుగ చూస్తు.

"అయినా ఒక్కన్ని నలుగురెట్లా" అని మళ్ళీ తానే అంటూ వున్నప్పుడు.

"అయితే నలుగురైదుగురు మొగవాళ్లు ఒక్క ఆడదానిని ఆ సంగతి" ఎన్నిసార్లు పేపర్లో చదవలేదు". అనుకుంది... కాని బయటికి అనలేకపోయింది శాలిని.

"ఇక మేమెలతామండి యస్.ఐ. గారు" అంది జానకీదేవి.

యస్.ఐ. సరె అన్నట్టు చూస్తు " ఓ పనిచేయండి అమ్మాయిలిద్దరు కార్లో, మిగతా ఇద్దరు వ్యాన్‌లో కూర్చోండి, పెద్దవాళ్లు అందులో ఇద్దరు ఇందులో ఇద్దరు కూర్చోండి ఎందుకైనా మంచిది" అన్నాడు.

'ఇందులో ఏ క్షేమం దాగిందో అనుకుంటు' "సరె అలాగే" అని కూర్చున్నారు కార్లు కదిలేముందు వాచ్‌మెన్ రెండు చోట్ల చేతులు జోడించాడు. రెండు పచ్చనోట్లు అతని దోసిల్లోకి చేరాయి.

కార్లు కదిలినయి.

వాళ్లు పోగానే యస్.ఐ.కి దండంపెట్టాడు వాచ్‌మెన్.

అది గ్రహించి "గెస్టుహౌజ్‌లో చేయగూడని పని నేనేమన్నా చేస్తినా? అయినా వాళ్లిచ్చారుగ, పోలీసు డబ్బులు అరుగవుర. ఇవ్వమంటె ఇస్త" అన్నాడు సూటిగ చూస్తు.

వాచ్‌మన్ తలగోక్కుంటు చూసాడు.

"ఇప్పుడు పోయింది ఎవరురా?" గుట్టుగ అడిగాడు.

"తెలవదు సార్"

"తెలవంది ఇంతసేపు వుంచావా? ఏది రిజిష్టర్ పట్టుకరా"

"అందులో రాయలేదుగ"

"ఎందుకో"

"తమరే వద్దన్నారుగ"

"వరేయ్ ఇంక ఎక్కువ మాట్లాడకు. మా హెడ్ కెరుకయితే ఆ రెండు నోట్లను లాక్కెలుతడు. ఉన్నంతలో సర్దుకో" అంటు బయటికి నడిచాడు.

'బతికించావురా దేవుడా' అనుకుంటు వాచ్‌మెన్ గేటు మూసుకున్నాడు. యస్. ఐ. స్టేషన్ వైపు నడిచాడు.

గెస్టుహౌజ్‌లో ఆడవాళ్లు వున్నరంటె 'వుండిరాపోయిరా' అని కొందరు వచ్చి దూరంనుండె చూసి పోతువున్నారు.

అక్టోబరు 03.

(ఒకప్పుడు సాగర్ రోడ్డులో జరిగిన వాస్తవ సంఘటనకు కథా రూపం)